సేవాభావం అలవర్చుకోవాలి


రంజాన్ తోఫాలను అందజేస్తున్న మాజీ హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: ప్రతి ఒక్కరు సేవాభావం అలవర్చుకోవాలని మాజీ హోంమంత్రి మహమూద్ అలీ, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్‌లోని కలర్స్ ఫంక్షన్ హాల్‌లో ఇనాయా ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు సహకారంతో ఆదివారం ఉప్పల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ మైనారిటీ నేత ఎంకే బద్రుద్దీన్ ఆధ్వర్యంలో పేద ముస్లింలకు నెల రోజుల నిత్యావసర సరుకులు, రంజాన్ తోఫాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు సరుకులు, గిఫ్ట్‌లను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పేదలకు సాయం చేయాలనే సంకల్పం గొప్పదన్నారు. తమకు ఉన్న దాంట్లో సాయం చేయడంలో గొప్ప అనుభూతి ఉంటుందన్నారు. వితంతువులు, వికలాంగులు, పేద కుటుంబాలకు ఆర్థిక చేయూత నివ్వాలనే ఆశయంతో ఇనాయా ట్రస్టు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. వారికి తమ తోడ్పాటు ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గోగికార్ శివ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం


కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో ..

అల్వాల్: కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ ఆధ్వర్యంలో ఆదివారం వినాయక్‌నగర్‌లో మహిళ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర సేవాదళ్ చీఫ్ ఆర్గనైజర్ భవాని త్రివేది, రాష్ట్ర మహిళా సేవాదళ్ సెక్రటరీ మోమిన్ సఫియాలు హాజరై పలువురు మహిళ ఉద్యోగినులను సత్కరించారు. కార్యక్రమంలో సేవాదళ్ చైతన్య జిల్లా ఉపాధ్యక్షురాలు రాణి, మల్కాజిగిరి బీ–బ్లాక్ అధ్యక్షురాలు గౌసియా, నాయకులు మోహన్‌బాషా, ఆశ, నర్సింహగౌడ్, అశోక్, వెంకటేష్‌గౌడ్, సేవాదళ్ మహిళ నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

సూర్యనగర్ కాలనీలో..

అల్వాల్: అల్వాల్ సూర్యనగర్ కాలనీ ఫేస్–2లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు, సావిత్రిబాయి పూలే వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ తొలిదశ ఉద్యమకారురాలు దాండిగే జనబాయి, పలువురు మహిళ వయోవృద్ధులను సత్కరించారు. కార్యక్రమంలో గొట్టిముక్కల జ్యోతిగౌడ్, నందిని, అంబిక, సుజాత, స్నేహగౌడ్, పద్మ, సుగుణ, రజిత, భాగ్య, శ్రీలత, లలిత, రాధా, నీరజ, శాంతి, కవిత, సునీత, సుగుణ, సాహితి, లక్ష్మీ, రేష్మ, జయమ్మ, వనజ, సారిక, సరిత, సుమన్, సతీష్, లోకేష్, మారుతిగౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి



మల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మల్లాపూర్ డివిజన్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు. వీరికి మందముల పరమేశ్వర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో గుడిసె సాయి,రాంపల్లి సాయి, మధు, విన్నూ, టిల్లు ఉన్నారు. కార్యక్రమంలో డీసీసీ మాజీ ఓబీసీ చైర్మన్ బొంగోని ఉమేష్‌గౌడ్, బాలరాజ్‌గౌడ్, కప్పెర సాయి, గడ్డం వినీష్, జయంత్, గణేష్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

మూసీని మూసేస్తున్నారు

రామంతాపూర్‌లో యథేచ్ఛగా ఆక్రమణలు

- బఫర్ జోన్‌లో మట్టి నిర్మాణ వ్యర్థాలతో నింపేస్తున్న అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు


బఫర్ జోన్‌లో మట్టిని పోసిన దృశ్యం


బఫర్ జోన్‌లో నిర్మాణాలు

రామంతాపూర్ : ఓ వైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ నది బఫర్ జోన్లను సుందరీకరించాలని పలు విదేశీ సంస్థలతో చర్చలు జరుపుతుంగా మరో వైపు రామంతాపూర్ భగాయత్‌ను అనుకుని ఉండి సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ నుంచి ఉప్పల్ భగయత్ హెచ్‌ఎండీఏ లే ఔట్ వరకు దాదాపు ఐదు కిలో మీటర్ల మేర విస్తరించి ఉన్న మూసీ బఫర్ జోన్ స్థలాన్ని అక్రమార్కులు కబ్జా చేస్తున్నారు. లారీలు, ట్రాక్టర్ల ద్వారా నిర్మాణ వ్యర్థాలు, మట్టిని తెచ్చి మూసీ నదిని మూసేస్తున్నారు. ఇటీవల కొంత మంది అక్రమార్కులు షెడ్ల నిర్మాణానికి ప్రయత్నించగా స్థానికుల సమాచారం రెవెన్యూ అధికారులు వారిని అడ్డుకున్నారు. అదే విధంగా బఫర్ జోన్‌లోనే ఉన్న హిందూ శ్మశాన వాటికను కూడా వదలకుండా అమ్మేసుకున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం దారుణమని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

◆ **పేదలే సమిధలు...**

బఫర్ జోన్‌లోని భూములను అక్రమార్కులు బఫర్ జోన్ అని తెలియని అమాయకులైన పేదలకు విక్రయిస్తున్నారు.

◆ **మూసీపై డ్రోన్ సర్వే.....**

మూసీ బఫర్ జోన్ ఆక్రమణలను గుర్తించడానికి మూసి సుందరీకరణ, పరిసరాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి దృష్టి పెట్టారు. రామంతాపూర్‌తో పాటు నగరంలోని మూసీ పరివాహక బఫర్ జోన్‌లోని ఆక్రమలను గుర్తించేందుకు త్వరలో డ్రోన్ సర్వే చేపట్టనున్నట్లు సమాచారం. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల అనుచరులుగా చెప్పుకుంటూ కబ్జాలు చేపడుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

◆ **అక్రమ షెడ్ల నిర్మాణం..**

బఫర్ జోన్ పరిధిలో అక్రమ షెడ్ల నిర్మాణం జోరందుకుంది. ఈ షెడ్లలో వివిధ రకాలైన పరిశ్రమలు ఏర్పాటు చేసి వ్యర్థాలను మూసిలోకి వదులుతున్నారు. ఈ ప్రాంతంలో మూసీని పరిరక్షించాల్సిన రెవెన్యూ జీహెచ్‌ఎంసీ ఇరిగేషన్ హెచ్‌ఎండీఏ నిర్లక్ష్యం కారణంగానే బఫర్ జోన్‌లో స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులకు బఫర్ జోన్ ఆక్రమణలపై ఫిర్యాదు చేసినా ఫలితం ఉండటం లేదన్నారు.

పట్టించుకోవడం లేదు



రామంతాపూర్ భగాయత్ పరిధిలోని మూసీ పరివాహక ప్రాంతంలోని బఫర్ జోన్ పరిధిలో మట్టితో నిర్మాణ వ్యర్థాలు నింపుతూ మూసిని మూసేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ విషయాన్ని అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదు. కనీసం ప్రజాప్రతినిధులైన పట్టించుకుని అధికారులపై ఒత్తిడి తెచ్చి బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలు ఆపాలి . ఈ బఫర్ జోన్‌లో అక్రమార్కులు లే ఔట్‌లు చేసి తక్కువ ధరలోనే పేద ప్రజలకు అమ్ముతున్నారు. బఫర్ జోన్ అని తెలియక వారు మోసపోతున్నారు.

–విజయేందర్‌రెడ్డి, సాయి కృష్ణ కాలనీ

జోరుగా షెడ్ల నిర్మాణం



రామంతాపూర్ బఫర్ జోన్ పరిధిలో షెడ్ల నిర్మాణం చేపట్టి వాటిలో పార్కింగ్ ప్రదేశాలుగా ఇతర వ్యాపార కార్యకలాపాలకు వినియోగించుకుంటున్నారు. దీనిపై ఉప్పల్ మండల రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తెచ్చినా అక్రమార్కులపై చర్యలు తీసుకోవడం లేదు. దీంతో పాటు బఫర్ జోన్‌లోని స్థలాలను అక్రమార్కులు పేదలకు విక్రయిస్తున్నారు. బఫర్ జోన్ అని తెలియక పేద ప్రజలు మోసపోతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు అధికారులపై ఒత్తిడి తెచ్చి బఫర్ జోన్‌ను కాపాడాలి.

–పడిగం నగేష్, బాలకృష్ణనగర్

ఏఎస్ రావు సైన్స్ టాలెంట్ అవార్డుల ప్రదానం

కాప్రా: డాక్టర్ ఏఎస్ రావు అవార్డు కౌన్సిల్ ఆధ్వర్యంలో 33వ సైన్స్ టాలెంట్ అవార్డులు అందజేశారు. ఇటీవల నిర్వహించిన సైన్స్ టాలెంట్ సెర్చ్ పరీక్షల్లో విజేతలుగా నిలిచి వారికి ఆదివారం ఏఎస్‌రావునగర్‌లోని డాక్టర్ హోమీజే బాబా కమ్యూనిటీ హాల్‌లో కౌన్సిల్ సభ్యులు అవార్డులు ప్రదానం చేశారు. మొదటి బహుమతిగా ఖమ్మంకు చెందిన రెబ్బ ఆదిత్య, , సూర్యపేటకు చెందిన నేహాకు రూ. 25 వేలు, రెండో బహుమతిగా రూ. 15 వేలు విజయ్, రాజమండ్రికి చెందిన లోహిత్ కుమార్, మూడో బహుమతిగా రూ. 10 వేలు ఖమ్మంకు చెందిన కుదురుమల్లు ధాత్రి, రాజమండ్రికి చెందిన కశ్యప్ వంశీ అందుకున్నారు. తర్వాతి స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ప్రశంస పత్రాలతో పాటు పుస్తకాలు బహుకరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. విద్యార్థులు అబ్దుల్ కలాం, డాక్టర్ హోమీజే బాబా లాంటి శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఎస్ఐఆర్–ఐఐఎస్‌టీ చీఫ్ సైంటిస్ట్ డి.శైలజ, ప్రొఫెసర్ సి.నాగేశ్వరరావు, ఏఎస్‌రావు అవార్డు కౌన్సిల్ కార్యదర్శి రామరాజు, కన్వీనర్ సీఎస్‌వీఆర్‌కే చౌదరి, కౌన్సిల్ సలహాదారులు ప్రొఫెసర్ ఎల్‌ఎస్ రావు, కౌన్సిల్ ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీ వైవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఈటలను కలిసిన రవీంద్రసాగర్

మల్లాపూర్: మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థిగా ఈటల రాజేందర్‌ను బీజేపీ అధిష్టానం ప్రకటించిన సందర్భంగా ఆదివారం ఉప్పల్ నియోజకవర్గ ఎంబీసీ చైర్మన్ సంగిశెట్టి రవీంద్రసాగర్ మర్యాదపూర్వంగా కలిసి అభి నందనలు తెలిపారు.ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేస్తామని ఈటలకు హామీ ఇచ్చారు. ఈటలను కలిసిన వారిలో మల్లాపూర్ డివిజన్ బీజేపీ నేతలు తదితరులు ఉన్నారు.

అభినందనలు

అల్వాల్: మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను ఆదివారం మేడ్చల్–మల్కాజిగిరి అర్బన్ జిల్లా అధ్యక్షులు మురళీకృష్ణ ఆధ్వర్యంలో పలువురు నేతలు సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు.

శుభాకాంక్షలు

ఉప్పల్: ఉప్పల్ బీజేపీ నేతలు ఆదివారం మల్కాజిగిరి బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ మోదీ ప్రభంజనంలో ఎవరూ నిలబడలేరని, తిరిగి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి కార్యకర్త, నాయకులు సైనికుల్లా పనిచేసి పార్టీని గెలిపించాలన్నారు. ఈటలను కలిసిన వారిలో ఎస్సీ మోర్చా అధ్యక్షులు మురళీకృష్ణ, ఏచూరి యాదగిరి,, శ్యామ్, జిల్లా, డివిజన్ నాయకులు తదితరులు ఉన్నారు.

కళాసిల్క్ చేనేత హస్తకళా మేళా ప్రారంభం



లాలాపేట: తార్నాకలోని ఐఐసీటీ స్టాఫ్ క్లబ్‌లో ప్రారంభమైన కళాసిల్క్ చేనేత హస్తకళా మేళాకు స్పందన వస్తోందని నిర్వాహకులు వికాస్ జైన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేనేత హస్త కళాకారులు తమ సొంత మగ్గాలపై తయారు చేసిన వస్త్రాలు, పట్టు చీరలు మంగళగిరి పట్టు సారీస్ స్పెషల్ కలెక్షన్, బ్లాక్ ప్రింట్ సిల్క్ సారీలతో పాటు ఇంటికి అవసరమయ్యే కళాఖండాలు, ఇతర వస్తువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ నెల 31 వరకు ఈ మేళా కొనసాగుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చిలుకానగర్ అభివృద్ధికి కృషి

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లో రూ.కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా ఎన్నికైన గీతను హైకోర్టు కాలనీ మహిళలు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని ప్రాధాన్యత క్రమంలో నెరవేరుస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే అధికారులను సమన్వయం చేసుకుంటూ డివిజన్ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు వెచ్చించినట్లు తెలిపారు. స్థానికుల మద్దతుతో డివిజన్‌ను మరింత అభివృద్ధి చేస్తానన్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు బహుమతుల ప్రదానం

మేడిపల్లి: తెలంగాణ అల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యారమ్స్ పోటీల్లో సీనియర్ సిటిజన్స్ ఉత్సాహంగా పాల్గొని సత్తా చాటారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ఆదివారం బుద్ధానగర్‌లో బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కార్పొరేటర్ మద్ది యుగేందర్ రెడ్డి, అంతర్జాతీయ క్యారమ్ ఆటగాడు కె.శ్రీనివాస్ విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ..సీనియర్ సిటిజన్స్‌కు ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు.ఆటలతో మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందన్నారు.ఇలాంటి పోటీలను క్రమంతప్పకుండా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు.

విజేతలకు ట్రోఫీల ప్రదానం

మల్లాపూర్: శాంతి యూత్ క్లబ్ ఆధ్వర్యంలో శివరాత్రిని పురస్కరించుకుని ఓల్డ్ మల్లాపూర్‌లోని మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహించిన చాందిని క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. విజేతగా కల్యాణ్ బాయ్స్ జట్టు నిలిచింది. రన్నర్‌గా శాంతి యూత్‌క్లబ్ గెలుపొందింది. ముఖ్య అతిథులుగా హాజరైన మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నేత నెమలి అనిల్ బహుమతులను అందజేశారు.

మహిళల ప్రాధాన్యం పెరగాలి

బోడుప్పల్: సమాజంలో మహిళల ప్రాధాన్యత పెరగాలని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. బోడుప్పల్ ఎస్‌ఎస్‌ఎస్ గార్డెన్‌లో ఆదివారం జరిగిన అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా హెల్త్ క్యాంపు ఏర్పాటు చేసి సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మహిలా సిబ్బందికి వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు, ఉత్తమ ప్రతిభ కనపర్చిన పారిశుద్ధ్య సిబ్బందికి బహుమతులు అందజేశారు. మహిళ కార్పొరేటర్లు, ఉద్యోగులు, సిబ్బందిని శాలువలతో సత్కరించి ప్రశంసా పత్రం, మెమొంటోలతో సత్కరించారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి

కాప్రా: తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయ్ పూలే వర్ధంతి సందర్భంగా ఆదివారం కమలానగర్‌లోని కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..బడుగు బలహీనవర్గాలు, అణగారిన వర్గాలకు ఆడపిల్లలకు విద్యను అందించిన ఘనత సావిత్రీబాయి పూలేకు దక్కుతుందన్నారు. సావిత్రి బాయ్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరు ముందుకెళ్లాలని కోరారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

మల్లాపూర్: అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మల్లాపూర్ మాజీ వార్డు కమిటీ సభ్యులు పీఆర్. ప్రవీణ్ అన్నారు. మహనీయుడికి మణిహారం కార్యక్రమం 388వ ఆదివారానికి చేరిన సందర్భంగా మల్లాపూర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షులు పర్నాటి వెంకట్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కర్రె శంకర్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రఘువరన్, ముఖ్య సలహాదారు పీజీ. సుదర్శన్, పెగుడ నరసింహా, సభ్యులు తునికి నరసింహ, విశ్వనాథం, సురేందర్, బాల చందర్, జితేందర్ పాల్గొన్నారు.

సీ మెట్‌లో ముగిసిన అంతర్జాతీయ సదస్సు

కుషాయిగూడ: చర్లపల్లి పారిశ్రామికవాడలోని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ సెంటర్ ఫర్ మెటీరియల్ ఫర్ ఎలక్ట్రానిక్స్ టెక్నాలజీ (సీ మెట్)లో ఎమర్జింగ్ సెమీకండక్టర్ మెటీరియల్ అండ్ అప్లికేషన్ అనే అంశంపై జరిగిన మూడు రోజుల సదస్సు ఆదివారం ముగిసింది. వివిధ పరిశ్రమలు, యూనివర్సిటీలు, ఆర్ డీ ల్యాబ్స్‌తో పాటుగా పలు విభాగాలకు చెందిన శాస్త్రవేత్తలు పరిశోధన పత్రాలను సమర్పించారు. రానున్న రోజుల్లో పరిశోధనలతో పాటుగా సెమీకండక్టర్స్ వంటి ముడి సరుకుల తయారీ రంగంలో భారత్ వృద్ధి సాధించేందుకు ఈ వేదిక దోహదపడుతుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. చివరిరోజు జర్మనీ ఐకేజెడ్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన డాక్టర్ ఆర్ రాధాక్రిష్టన్ సుమతి, బిట్స్ పిలానీకి చెదిన సాంకేత్ గోయల్, మంజీర డిజిటల్ సిస్టమ్స్ సీఈఓ డాక్టర్ వేణు, చెన్నయ్‌కు చెందిని ఇన్నోవెటీవ్ వెంచర్స్ సీఈఓ డాక్టర్ క్రిష్ణమూర్తి, హెచ్‌సీయూ ప్రొఫెసర్ డాక్టర్ నాగేశ్వరరావులు తమ పరిశోధన పత్రాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో సదస్సులో వివరించారు. సదస్సులో సీ మెట్ డైరక్టర్ రతీష్‌తో పాటుగా పలువురు పాల్గొన్నారు.

గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా నర్సింగ్ గౌడ్

మల్లాపూర్: గీత పారిశ్రామిక సహకార సంఘం మీర్‌పేట్ అధ్యక్షుడిగా ఓల్డ్ మల్లాపూర్‌కు చెందిన దుబ్బాకుల నర్సింగ్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యడిగా టీ.శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా దంతూరి రాజుగౌడ్, డైరెక్టర్లుగా ఎ. రాజుగౌడ్, బి. రాజుగౌడ్ ఎన్నికయ్యారు. అనంతరం దుబ్బాకుల నర్సింగ్ గౌడ్ మాట్లాడుతూ మీర్‌పేట్ గీత కార్మిక సహకారం సంఘం సంక్షేమానికి తన వంతుగా కృషి చేస్తానన్నారు.

అన్ని దానాల్లో అన్నదానం గొప్ప

కుషాయిగూడ: అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కుషాయిగూడ పోచమ్మ ఆలయం వద్ద మారుతీ మిత్రమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమావాస్య అన్నదానం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగ పోచమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ ప్రతినిధులు ఆయనను ఘనంగ సత్కరించారు. అమావాస్యరోజు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న మారుతీ మిత్రమండలి ప్రతినిధులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో మారుతీమిత్ర మండలి అధ్యక్షుడు గురుమంచి అశోక్‌చారి, ప్రధాన కార్యదర్శి వరగంటి హన్మంతు, ప్రతినిధులు బాబు, వేణుగోపాల్‌చారి తదితరులు పాల్గొన్నారు.

యూనిఫామ్ సివిల్ కోడ్‌పై అవగాహన

అల్వాల్: ఓల్డ్ అల్వాల్‌లోని బ్లెస్ ఫీల్డ్స్ భవనంలో ఆదివారం రాష్ట్ర చేతన ఆధ్వర్యంలో యూనిఫాం సివిల్ కోడ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ప్రముఖ జర్నలిస్ట్, న్యూస్ అనాలసిస్ట్ రాక సుధాకర్ హాజరై యూనిఫామ్ సివిల్ కోడ్, వివిధ అంశాలపై వివరించారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 5 కే రన్


'రన్ ఫర్ షీ' కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

ఉప్పల్: మహిళా శక్తి చాలా గొప్పదని చాటి చెప్పేందుకు ఉప్పల్ డీఎస్ఎల్ వర్చుమాల్ ఆధ్వర్యంలో ఆదివారం 'రన్ ఫర్ షీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉప్పల్ పరిసర ప్రాంతాల్లోని ఐటీ కంపెనీల ఉద్యోగులు, వ్యాపార వేత్తలు, జర్నలిస్టులు, పోలీసు అధికారులు, చిన్న పిల్లలు, విద్యార్థులు, డిఎస్ఎల్ షాపు నిర్వాహకులు రన్‌లో పాల్గొని ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అద్భుతంగా రాణిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరు ఫిట్‌నెస్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలు మరింత శక్తివంతం కావాలని, సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.